# కథ గురించి కథ



ఇలాంటి కథ వ్రాయాల్సి వస్తుందనుకోలేదు. నా రచన వల్ల ఇలాంటి పరిణామాలు జరుగుతా యనుకోలేదు. అనుకుంటే అసలు రచయిత నయ్యే వాణ్ణే కాదు.

కౌసల్య నాకు విచిత్రమైన పరిస్థితుల్లో పరిచయమైంది.

కలలూ, ఆశలూ ఊపిరిగా మద్రాసులో చదువు పూర్తి చేసుకొని, ఇక ప్రపంచం మీదికి పొట్ట చేతపట్టుకొని బయలుదేరడానికి సిద్ధంగా పుట్టిన పల్లె చేరుకున్నాను. అప్పటికే మా ఊరు హైస్కూలుతోనే చదువుకి స్వస్తిచెప్పిన నా చిన్ననాటి మిత్రులంతా కలిసి ఒక సాంఘిక నాటకాన్ని వేస్తున్నారు. నే నక్కడికి చేరిన వారం రోజుల్లోనే ప్రదర్శనం. నాటకానుభవం ఉన్నవాడినని రిహార్సల్స్ పర్యవేక్షించడానికి నన్ను పిలిచారు.

వెళ్ళడం నా కిష్టం లేదు. పల్లెల్లో సాంఘిక నాటకాల గురించి నాకు తెలుసు. నాటకానికి నటి ప్రాణం. డబ్బెక్కువ ఖర్చు చేసే వాడికే ప్రధాన పాత్ర. కొంచెం నోటి దురుసున్నవాడే విలన్. అందరికీ పాంటులూ, షర్టులూ వేసుకున్న కుర్రవేషాలూ, హీరోయిన్‌తో డ్యూయెట్లున్న వేషాలూ కావాలి. పార్టులు కంఠస్థం చెయ్యరు. సరైన ప్రయోక్త ఉండడు. చవకబారు ఫార్ములా నాటకాలే ఎన్నుకుంటారు. హీరోయిన్‌ని తెచ్చి, రంగు వేసుకొని స్టేజీ ఎక్కిపోవడమే నటుల ధ్యేయం. స్టేజీకి తెర లుండవు. సరైన లైట్లుండవు. సెట్టింగు లుండవు. అన్నీ ఉన్నా, ఆ ఊరి ప్రెసిడెంటు గారో, నాయుడుగారో చుట్ట కాల్చుకుంటూ స్టేజీ మధ్యనే కూర్చుంటారు. వారిని దిగమని చెప్పడానికి ఎవరికీ గుండె లుండవు. నాటకం సాగుతూండగా రంగంమీద మైక్ వాడూ, లైట్ల వాడూ, టీలవాడూ యథేచ్ఛగా విహరిస్తూనే ఉంటారు. ఇన్ని ఇబ్బందులూ తెలిసి నాటకం జోలి కెందుకు పోవడం?

అయినా, పోక తప్పింది కాదు. ఊరు లోంచి ఒకడు బాగా చదువుకొని వస్తే వాడి దగ్గర పల్లెటూరి మిత్రులకి ఇన్ఫీరియారిటీ ఉంటుంది. అందులోనూ పిలిచినా వెళ్ళకపోతే గర్విష్టి అంటారు. అందుకని వెళ్ళాను.

తీరా చూస్తే దర్శకు డెవరూ లేడు. స్క్రిప్టు మంచిది కాదు. ఎవరికీ నట నంటే ఏమిటో తెలీదు. కాని, నాటకం వేసెయ్యాలి. అది వాళ్ళ పట్టుదల. హీరో వెయ్యాల్సిన శ్రీరాములు ముసలి పాత్ర వేస్తున్నాడు. బంట్రోతు వెయ్యవలసిన అప్పారావు హీరో వేస్తున్నాడు. విదూషకుడు వెయ్యాల్సిన ఏకాసిరావు మరొక ప్రధాన పాత్ర వేస్తున్నాడు. ముసలి వేషానికి పనికొచ్చే సన్యాసిరావు హాస్య పాత్ర వేస్తున్నాడు.

నే నేవో సలహా లిచ్చాను. అవి వాళ్ళకి నచ్చాయి. ఇక వరుసగా రిహార్సల్స్‌కి వెళ్ళక తప్పలేదు. ఆవిధంగా ఆ నాటకానికీ, నాకూ ఒక సంబంధం ఏర్పడిపోయింది.

నటిని విజయనగరంనుండి బుక్ చేశారు. ఆమె ప్రదర్శనకి ముందు రోజే వస్తుందట. అంతవరకూ స్త్రీపాత్ర ప్రమేయం లేకుండానే రిహార్సల్స్ జరిగిపోయాయి.

సరిగ్గా అనుకున్ననాటికే గాని, అనుకున్న వేళకి మించి వచ్చిం దామె. సన్నగా, పొడవుగా, నీలికళ్ళు కోల ముక్కుతో చురుగ్గా ఉంది. అందంకన్నా ఆకర్షణగా ఉంది. వస్తూనే బస్సు దగ్గరకి నటు లెవ్వరూ వెళ్ళనందుకు ధుమధుమ లాడింది. అసలు మా వాళ్ళంతా వెళ్ళే వాళ్ళే. ఆమె పెట్టె బెడ్డింగూ మోసుకు వచ్చే వాళ్ళే. బాగుండదనీ, అలా చేస్తే హీరోయిన్ చిన్న చూపు చూస్తుందనీ నేనే వద్దన్నాను. మనిషిని పంపితే చాలన్నాను. వాళ్ళు నా మాట వినక తప్పింది కాదు.

వరుస నాటకాలు ఆడుతూ వస్తూండేమో అలసటతో, నిద్ర లేమితో, చిన్న జ్వరంతో, తల నొప్పితో వచ్చింది. నాకు జాలి వేసింది. నాటకానికి డీన్ నేనే అయితే, ఆమె కివ్వాల్సిన డబ్బిచ్చి పంపేసే వాణ్ణి.

మా శ్రీరాములు న న్నామెకు పరిచయం చెయ్యనే చేశాడు. "మా వాడే— పేరు రావు. ఊరు ఈ ఊరే. చదువు

-టి. షణ్ముఖరావు

మద్రాసులో. రచయిత. నాటకాలు రాస్తాడు. వేయిస్తాడు. కాని, వెయ్యడు. ఇప్పు డీ నాటకానికి దర్శకు డితనే" అని పాఠం అప్పచెప్పినట్టు చెప్పి, నన్ను చూసి నవ్వుతూ — "ఇంకేమైనా మరిచి పోయానా?" అన్నాడు.

"చెప్పకూడనివి కూడా చెప్పావు. నిరుద్యోగినని చెప్పడం మరిచిపోయావు" అన్నాను నేనూ నవ్వుతూ.

"నమస్తే!" అందామె.

"నమస్తే! మీ పేరు?"

"కౌసల్య!"

నన్ను మా వాడు ఆ చెత్త నాటకానికి దర్శకుడిగా పరిచయం చేసినందుకు సిగ్గేస్తోంది. 'చూడండి. ఈ

కుర్ర గాడిద' అని పరిచయం చేస్తే వాడెంతో మురిసిపోతాడు. అది వాడికి గౌరవం. 'ఈ గాడిద ఆ శాస్త్రిగారిది' అంటే నా రెలా ముఖం పెడతారు?

"ఆలా నాస్టీగా ఉంది, రావుగారూ!" అంది.

"నిమిషాలమీద మందు తెస్తాను" అంటూ పరుగెత్తాడు మోహనరావు. అలాగే తెచ్చాడు. వాడికి శ్రీరమణమూర్తి అని పేరు.

మా నటులంతా కౌసల్యకి పరిచర్యలు చెయ్యడంలో మునిగిపోయారు. ఎవర్నీ వారించలేకపోయాను. నటి అన్న పేరుతో ఎవరైనా గ్రామాల కొస్తే, ఆమెని భోజనానికి పిలిచే వాళ్ళూ, టీకి రమ్మనేవాళ్ళూ, కావలసినవన్నీ తెచ్చి ఇచ్చే వాళ్ళూ ... చెప్పకూడదు గాని, చీరలు ఉతకడానికి కూడా సిద్ధమైన వాళ్ళూ ఉంటారు.

రెండో రోజుకి—అంటే నాటకం ప్రదర్శన నాటికి—బాగా కోలుకుంది.

"థాంక్స్, రావుగారూ! నౌ అయామ్ ఆల్‌రైట్" అంది.

"నా కెందుకు? మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకున్న మన నటులందరికీ చెప్పండి. నేనే దూరంగా ఉన్నాను."

"అందుకే మీకే థాంక్స్!"

చిత్రమైన మనిషి!

నా గురించి, నా రచనల గురించి నా వెనకే తెలుసుకున్నట్టుంది. "మంచి పేరుంది మీకు. మీ ఫోటో చాలా సార్లు చూశాను పత్రికల్లో. వీళ్ళందరి కంటే మీతోనే పరిచయ మున్నట్టుంది" అంది.

"థాంక్స్, కౌసల్యా!"

"అన్నట్టు ... ఇదేమిటీ—మీ సన్యాసి రావుగారు నా ప్రక్కన తనకి పాత్ర లేదనీ, ఉండేటట్లు మీచేత రాయించమనీ అంటున్నారు" అంది.

'కొంప ముంచాడు' అనుకున్నాను.

"అదెలా సాధ్యం? నాటకాన్ని మార్చటం మర్యాద కాదు."

"ఏవో నాలుగు డైలాగులు రాసి ఇచ్చెయ్యండి, పాపం."

ఖర్మ! పిచ్చని చూసి కౌసల్య జాలి పడుతూంది.

"వద్దు. అతనికి నే చెప్తా లెండి" అనేశాను.

కానీ, మరో సమస్య తల ఎత్తింది. ప్రేక్షకులంతా హీరోయిన్ రికార్డింగ్ డాన్స్ చెయ్యాలని పట్టుపట్టారు.

"నేన్చెయ్యను" అని కూర్చుంది కౌసల్య.

ప్రేక్షకులు రెచ్చిపోతున్నారు.

మావాళ్ళంతా ఆమెని బ్రతిమాలుతున్నారు.

కౌసల్య మరీ మొండికెత్తింది.

అప్పుడు సమస్యని నేను పరిష్కరించాల్సి వచ్చింది.

"చూడండి, కౌసల్యా! మీ రిలా పట్టు పట్టి కూర్చుంటే చేసేదేమీ లేదు. ప్రజావాహిని సంగతి మీకు తెలిదులా ఉంది. ఓ పని చెయ్యండి. భరత నాట్యం తెలుసునా?" అన్నాను.

"కొంచెం తెలుసు" అంది.

"సరేం? అలాంటివే రెండు రికార్డులు వేయిస్తాను. ఏదో డాన్సని పించండి, చాలు. మీ బాధ నాకు తెలుసు. కాని, పరిస్థితి అలా వచ్చింది. తప్పదు" అన్నాను.

కౌసల్య మౌనంగా ఉంది.

"ప్లీజ్ ... నా మాట వినండి" అన్నాను.

"మీకోసం గజ్జె కడుతున్నాను, రావు గారూ!"

అయిపోయింది.

కౌసల్యలో గొప్ప నటి జీవిస్తోందని తెలుసుకున్నాను. ఉదయాన్నే వెళ్ళిపోతూ— "నమస్తే, రావ్ గారూ! మరిచిపోకండి" అని చెప్పి మరీ వెళ్ళింది.

కాని, కౌసల్యను అంతటితో మరిచే పోయాను.

## 2

ఇది జరిగిన తరవాత కూడా నా రచనలు ప్రచురిత మవుతూనే ఉన్నాయి. పాఠకుల్నించి లేఖలు వస్తూనే ఉన్నాయి.

నాకు ఉద్యోగంమాత్రం రాలేదు.


ఓ కథకి అకస్మాత్తుగా కౌసల్య నుండి ఉత్తరం వచ్చింది. అది కూడా ఆమెకి నా అడ్రెస్ తెలీక పత్రిక వాళ్ళకి వ్రాస్తే, వాళ్ళది నాకు పంపించారు.

అందరికీ అన్ని రచనలూ నచ్చవు. కొందరికి కొన్ని మాత్రమే నచ్చుతాయి. రచనలో ఏదో ఒక భాగంలో ఒకమాట తన జీవితానికో, తను చూసిన దానికో, విన్న దానికో స్పృశిస్తే ఆ రచన వాస్తవానికి దగ్గరగా ఉందని అనుకుంటాం. అలాంటి రచనలే మంచివనీ, గొప్పవనీ అంటాం. ఆ రచయితే పరిచయమున్న వాడైతే?

ఉత్తరం పెద్దదే. అంతా కథగురించే. కథ చాలా బాగుందనీ, వాస్తవంగా ఉందనీ, పాత్రలు ఆదర్శమైనవనీ సారాంశం.

ఆ కథే కౌసల్యని హత్తుకోవడానికి కారణం తెలీదు.

ఆ కథలో ఇతివృత్తం స్థూలంగా ఇది: ఒక రచయిత (పాత్ర) పరిస్థితుల ప్రభావం వల్ల కాలుజారి నా పేరు సెలయేరులా తిరుగుతున్న స్త్రీని ఆమె



కథ విని సానుభూతితో, జాలితో ఆమె కోరికపై ఆమెకి తాళి కడతాడు. ఆ తరవాత ఆమె లోకం విసుర్లకు తట్టుకో లేక ఎక్కడికో పలాయనమై పోతుంది.

కౌసల్య ఉత్తరానికి తప్పకుండా జవాబిమ్మని అర్థించినప్పటికీ ఎందుకో జవాబు రాయలేక పోయాను. బహుశా రాయడానికి ఏమీ లేక కావచ్చు.

కౌసల్య ఉత్తరానికి ఒక సాధారణ పాఠకురాలి ఉత్తరం కంటే ఎక్కువ విలువని అప్పట్లో ఇవ్వలేకపోయాను.

## 3

ఓ సారి నేను ట్రెయిన్‌లో వెళుతూ మిత్రుడు శ్రీపతిని కలుసుకోవాలని విజయనగరం స్టేషన్లో దిగాను.

అప్పుడే తెల్లవారుతూంది. ప్లాట్ ఫారం మీద చైతన్యం ఒళ్ళు విరుచు కొంటున్నట్టుగా ప్రజలు అటూ ఇటూ తిరుగుతున్నారు. టీ వాడి కేక, రొట్టెల వాడి అరుపూ, ప్రయాణీకుల గోలా, కూలీల పిలుపూ... ఇవన్నీ కలిసి స్టేషన్లో నిశ్శబ్దాన్ని దిగంతాలకి తరిమేస్తున్నాయి.

నే నొస్తున్నానని ముందుగానే తెలిసి, నే దిగేసరికే శ్రీపతి సిద్ధంగా ఉన్నాడు.

"ఎన్నాళ్ళు కెన్నాళ్ళకి? పత్రికల్లో నీ పేరు తప్పించి నిన్ను చూడలేకపోయా నోయ్. నీ ఉత్తరం నిన్ననే అందింది. అప్పట్నించీ స్టేషన్లోనే కాపరం పెట్టేశా నంటే నమ్ము" అంటూ వాటేసు కున్నాడు.

"భాయీ! నాకు నిన్ను కలవాలనే ఉంది. ఏం చెయ్యమూ? నిరుద్యోగిని? అభిమానాలకి అతీతంగా డబ్బు రాజ్యం చేస్తోంది దాని అనుమతి లేందే ఎలా రాను? పోనీ. నువ్వే రాలేకపోయావ్?"

"భలే. నన్నే అను. క్రిందటి కెవడో కుచేలుణ్ణి అన్నడిగాట్ట. పద... పద" అంటూ కారువైపు నడిచాడు.

"అవును మరి... బిజీ వ్యాపారివి. నీకు తీరి కెలా ఉంటుంది?" అంటూ వాడి వెనకనే నడుస్తున్నాను.

వెనకనుండి న న్నెవరో పిలిచిన ట్టయింది.

ఈ నగరంలో నన్ను తెలిసినవా రెవరబ్బా— అనుకుంటూ వెనక్కి తిరిగాను. కౌసల్య! జనాన్ని తప్పించు కుంటూ వస్తోంది.

"నమస్తే!"

"నమస్తే."

క్షణం ... ఏమనాలో తోచలేదు.

"బాగున్నారా?" అన్నా న్నేనే.

"బాగానే ఉన్నాను, నా ఉత్తరానికి మీ జవాబు తప్ప!"

"మరిచిపోలేదన్న మాట."

"ఎలా మరిచిపోతాను? ఎందుకు జవా బివ్వలేదో చెప్పండి" అంది నిలదీసి. మగవాణ్ణి చెప్పలేని స్థితిలో నెయ్యడం స్త్రీకి సరదా.

"అదా? ఏవో గొడవల్లో పడి ..."

"నిజం చెప్పాల్సిన రచయిత అబద్ధం చెబితే అందంగా ఉండదు." కౌసల్యకి నాటకాల్లోలా మాట్లాడ్డం అలవాటైన ట్టుంది.

"క్షమించండి" అనక తప్పలేదు. నవ్వింది.

ఇప్పుడు కౌసల్యని పరికించాను. అప్పటికన్నా కొంచెం లావయింది. బిగు త్రాగితే వచ్చే కాంతి చర్మం క్రింద అలుముకున్నట్టుంది. అవే కళ్ళూ, అదే చిరునవ్వు.

"ఇక్కడికేగదా ... పదండి, మా ఇంటికి" అంటూంది.

"వాడు నా గెస్టండీ" అంటూ వచ్చాడు శ్రీపతి.

"ఓ మీరా — నమస్తే!"

"నమస్తే! ఎక్కణ్నించి, కౌసల్యా?"

"శ్రీకాకుళం నుండి ... ఆమదాల వలసలో రైలెక్కాను" అంది.

"భలే ... నేను పలాసలో ఎక్కాను" అన్నాను.

"అయితే, ఇద్దరమూ ఒకే రైల్లో ప్రయాణించా మన్న మాట."

"మన గమ్యాలు వేరని మరిచి పోకండి" అన్నాను నవ్వుతూ.

"ఒకటే చేసుకోవచ్చుగా... పోనీ సాయంత్రం రండి ... మా ఇంటికి ... ఎదురుచూస్తుంటాను. మరిచిపోకండేం. ఇదిగో అడ్రసు" అంటూ చేతిలో కాగితం ఉంచి, "ఆయన్ని పంపించండి, శ్రీపతి గారూ" అంది.

"అలాగే పంపిస్తాను. సరేనా?" అన్నాడు.

కౌసల్య రిక్షా ఎక్కిపోయింది.

"ఆయ నంటోం దేమిటి?" అ



స్వేచ్ఛా విహారం

ఫోటో— పి. సుందరం (మద్రాసు – 35)

చెప్పాడు శ్రీపతి.

"నోర్మూయ్. తప్పు."

4

"రవీ! కౌసల్య నీ కెలా తెలుసు?"

"మా ఊర్లో నాటకానికొచ్చింది. కాని, ఈ ప్రశ్న నేనూ నిన్నడగ్గలను... నువ్వు చూస్తే పెద్ద బిజినెస్ మాగ్నెట్‌వి. ఆమె ఒక సాదా నటి."

"గ్రాండ్! ఈ జిల్లాలో రావ్ఫుకీ, సోదాకీ అందుబాటులో ఉన్నవాళ్ళందరి పేరు తెలుసు."

"అంత దిగజారిపోయావన్న మాట."

"ఇది 'ఎప్పటికీ పెరిగేదం' అని నీ కెందుకు?"

"ఎవరి పిచ్చి వారి కానందం. అంటారు."

"అయితే, రవీ! కౌసల్యతో నీ పరిచయం అంటావా? దశరథుత్వం ఏమైనా..."

"శ్రీపతీ! సంగం చదువుకున్న వాళ్ళం. సంస్కార వంతులం."

"సాయంత్రం నాతో రా! టెంపుల్ స్ట్రీట్‌లో బార్‌లో ఎంతమంది చదువుకున్న వాళ్ళూ, సంస్కారవంతులూ కనిపిస్తారో గానా. నీవాలు తెలియవాడిని ..."

"ఇన్ని శ్రీరంగనీతులు చెప్పకు."

"... చెప్పిందనా నమ్మకూడదని నువ్వే కాటోలు అన్నావు."

"నే నన్లేదు. ఎవరో అన్నారు గాని, నేనుమాత్రం మారలేదు."

"అలా అన్నావ్ బాగుంది. నమ్మాను."

"ఇప్పుడు చెప్పు, కౌసల్య ఎవరు? ఏమిటి?"

"కథ రాస్తావా?"

"అవసరమైతే!"

"విను. కౌసల్య గతం గురించిగాని, జీవితం గురించి గాని నాకేం తెలీదు. తెలిసిందల్లా ఆమె గోపీచంద్‌గారి ఉషా రాణీ, వరంగారి అరుణా, రాఘారి వారి మంజరీ — అలాంటి పాత్రకి హారుమరాలు! అయితేనేం? గొప్ప నటి. ఆమె నటించగా ఎన్నోసార్లు చూసి నాకే మతి పోయింది. సాయంత్రం రమ్మంటిగా. వెళ్ళు ... నీకే తెలుస్తుంది."

5

కౌసల్య నా చేతికిచ్చిన అడ్రస్ తీసుకొని బయలుదేరాను. పెద్దగా వెతకవలసిన అవసరం లేకుండానే ఇంటిని గుర్తుపట్టాను. వాకిట్లో ఆమె నిలుచుని ఎదురు చూస్తూంది.

"రండి. రండి మీకోసమే చూస్తున్నాను."

శ్రీపతి అన్న మాటలు గుర్తుకొచ్చాయి. కౌసల్యని పరీక్షగా చూశాను. పెద్దగా అలంకరించుకున్నదేమీ లేదు. నా రాకవల్ల కలిగిన సంతోషం మాత్రం కళ్ళలో కనిపిస్తూంది మెరుపులా.

"పద్మాసుగా" అంటూ ఆమె వెనకనే నడిచాను.

"మీరొస్తారనే అనుకున్నాను" అంది. ఏమి టీ అహం? మగవాడి బలహీనత మీద ఆడదాని కుండే అధికారమా ఇది? లేక పురుషుణ్ణి లిట్మస్ టెస్టు చేస్తూందా?

ఆ ఇంటి ముందర రోడ్డవతల కిళ్ళీ కొట్టు నుండి ఎవరో 'కొత్తలా ఉంది, గురూ! జేమ్స్ జాగర్త' అనడం లీలగా నా చెవిని పడింది. కౌసల్య చిన్నబుచ్చు కుందేమో అని ఆమె వైపు చూశాను.

నా ఊహ తప్పయింది. కౌసల్య నవ్వుతూంది, "కళాకారులకి ఈ దేశమిచ్చే గౌరవం చూశారా?" అంది.

ఇప్పుడు నేనే చిన్నబోయాను.

ఇల్లు పెద్దది కాదు. ఆ ఇంటికి పైన కప్పుగా ఉన్న పెంకు ఈ శతాబ్దంలో వేసింది కాదు. ఇంటి గోడలకి ఉన్న సున్నం ఈ దశాబ్దంలో వేసిందీ కాదు. ఉన్న ఒకే ఒక్క కిటికీగుండా గాలి, వెలుతురూ రాదు. గోడలకి తైల వర్ణ చిత్రాలుగాని, ద్వారాలకి ఖరీదైన తెరలుగాని, ఇంట్లో సోఫాసెట్టుగాని, ట్రాన్సిస్టరుగాని లేవు.

"మీరిలా కుర్చీలో కూర్చోండి" అంటూ ఓ మూలనున్న కుర్చీ చూపించింది. ఆ కుర్చీ వయస్సు చెప్పడం కష్టం. ఏ చరిత్రకారుడైనా చూస్తే శాతవాహన శకం నాటిది అనవచ్చు. శిల్పాన్నిబట్టి చూస్తే గతించిన తరాలవారి వైభవానికిది తొడిమగా మిగిలిం దనవచ్చు.

కూర్చోబోయాను.

అంతలోనే నవ్వింది. వేసవిలో అకస్మాత్తుగా వచ్చిన వాన జల్లు లాంటి నవ్వు.

ఆగాను. మిస్టిక్‌కి మారుపేరు స్త్రీ. ఆకారం లేని ఎనిగ్మా లాంటివే మన స్త్రీత్వానికి మరో రూపం స్త్రీ. ఈ నిమిషంలో కసరవచ్చు. మరో నిమిషంలో లాలించవచ్చు. ఒక చెంపమీద చెప్పుతో కొట్టి, మరో చెంపమీద కస్తూరి పూసుకున్న అరచేత్తో నిమరొచ్చు. ఒక చిత్రకారుడికి స్త్రీ సమగ్ర రూపం గియ్యమంటే ఒక పెద్ద క్వొశ్చన్ మార్కు వేసి ఇదే స్త్రీ అన్నాడట. అందుకని ఆగాను.

"మరేం లేదు. మొగల్ చక్రవర్తిలా వెనక్కి చేరగిలబడి కూర్చోకండి. మా ఇంట్లో దిండుల్లేవు" అంది.

నవ్వేసి, జాగ్రత్తగా కూర్చున్నాను.

"ఇప్పుడే వస్తాను" అంటూ ఇంట్లోకి వెళ్ళింది.

గదిలో ఓ మూల టేబిల్ మీద అద్దం, టాయిలెట్ సామానూ ఉన్నాయి. మరో మూల దండెం మీద చీర లున్నాయి. టేబిల్ మీద నాటకాల పుస్తకా లున్నాయి. గోడలకి కౌసల్యవే నాటకాల్లోని కొన్ని ఫోటో లున్నాయి. బహుశా చాలాకాలం క్రితం నాటివిలా ఉన్నాయి.

ఓ పుస్తకం అందుకున్నాను, ఏం తోచక.

అంతలో ఆ గదిలో ఓ మెరుపు మెరిసి, ఆ వెనకే గాజుల చప్పుడూ, చీర రెపరెపా, మంద్రస్వరంలో ఏదో పాటా వినిపించి తల ఎత్తాను. పాట ఆగిపోయింది. పదహారేళ్ళ కన్య! వెన్నెల పోతపోసి, అందులో గులాబీ రెక్కల్ని వేసి ప్రత్యేకమైన మానవాకారంగా మలిచి ప్రాణం పోసినట్టు ఇంకా ... ఇంకా ... ఓహ్ — అద్భుతమైన సౌందర్యం.

ఆ గదిలో ఎవరూ లేరనుకొని వచ్చినట్టుంది. నన్ను చూసి తడబడింది. టేబిల్ మీద అద్దం తీసుకొని వచ్చినట్టే పారిపోయింది.

దృష్టిని హృదయంలోనికి మరలిచి ఆ సౌందర్యాన్ని మనస్సు మీద చిత్రించుకుంటూనే పుస్తకం తిరగెయ్యబోయాను.

లోపలినుండి పిల్లవాడి గొంతు వినిపించింది. "అక్కా! నాకు కాఫీ ..."

"ఛో, వెధవా, ఎన్నిసార్లు తాగుతావు" కౌసల్య. వాడు ఏడుస్తున్నాడు. "తప్పురా. సినిమాకి తీసుకెళతాగా. అల్లరి చెయ్యకూడదు — మరి కాఫీ లేదు. చుట్టాలొచ్చారు..." ఓదారుస్తూంది.

ఇది సాధారణమైన సినిమా సన్నివేశమే. అయినప్పటికీ కౌసల్య ఆర్థిక పరిస్థితి అర్థమైపోయింది.

ఇందాకటి సౌందర్యం మళ్ళీ వచ్చింది. ఈసారి నెమ్మదిగా జడ్జిగారి తీర్పు ముందే తెలిసిన ముద్దాయిలా వచ్చింది. ఇందాకటి బెదురు లేదు. క్రీగంట చూస్తోంది. దువ్వెన తీసుకొని పోయింది.

పూర్ విజాలెసెంట్ గర్ల్!

ఈ సారి నేను మనస్సులో చిత్రించుకుంటున్న బొమ్మకి రూపం వచ్చింది. మళ్ళీ పుస్తకం తిరగెయ్యబోయాను. వచ్చింది. ఈ సారి మాత్రం కౌసల్య!

"క్షమించండి."

"దేనికి?"

"ఆలస్యం చేశాను" అంది కాఫీ అందిస్తూ.

అనవసరమైనచోట శ్రద్ధా, అవసరమైనచోట ఉపేక్షా స్త్రీ ప్రవృత్తి కాబోలు. లేకపోతే ఒక నిమిషం ఆలస్యానికి క్షమార్పణ దేనికి?

కాఫీ తీసుకున్నాను.

ఆ గదిలో మరో ఆసనం లేదు కాబట్టి కౌసల్య ద్వారం మీద కూర్చోబోయి తూలింది. "మీరు కనిపించినప్పుడల్లా నాకు జ్వరం వస్తూంటుంది ..." అంది.

జ్వరమా? అందుకే కాబోలు ఆ సుగ్రీవు లన్నట్టు 'మోహంలో ఉండే హీనత యొక్క వర్చస్సు' కనిపిస్తోంది. కళ్ళల్లోనికి చూస్తే సంధ్యలో సూర్యోదయం దర్శించినట్టుగా ఉంది. జ్వరం కూడా ఆకర్షణేనా?

"ఉదయానికి బాగానే ఉన్నారే?"

"లేదు. ఎక్కువ ప్రయాణాలైతే నాకు జ్వరం తప్పదు" అంది.

మళ్ళీ ఏమనాలో తోచలేదు. ఇద్దరి మధ్యా మౌనం. మనుషులు మౌనంగా ఉండి హృదయాలు మాట్లాడుకోవాల్సిన అవసరం స్త్రీ పురుషుల మధ్య తప్పదనుకుంటాను!

"శ్రీపతిగారు మీ కెలా తెలుసు?" అంది.

"ఇద్దరమూ మద్రాసులో చదువుకున్నాం."

"శ్రీపతిగారు బాగా ధనవంతులు కదూ ..."

"నేనుమాత్రం చాలా పేదవాణ్ణి, కౌసల్యా!" అన్నాను.

"గుణాని క్కాదుగా..." అంది.

ఇది సినిమా మాట. నాటకాలూ, నవలలూ, సినిమాలూ...వీటి ప్రభావం కౌసల్యమీద బాగా ఉన్నట్టుంది. మళ్ళీ నిశ్శబ్దం!

అప్పుడే పరిచయమవుతున్న స్త్రీ పురుషుల మధ్య ఏ ప్రస్తావన ఎటువైపు దారి తీస్తుందో అని ఇద్దరికీ బెరుకుగానే ఉంటుంది. అప్పుడు మౌనం కాలాన్ని జయిస్తుంది.

"చెప్పండి" అంది కౌసల్య, నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ.

"ఏం చెప్పమంటారు?"

"ఏదైనా చెప్పండి. పోనీ, కవిత్వం చెప్పండి."

"నేను కవిని కాను. రచయితని."

---

### ప్రేమ

స్త్రీ ప్రేమ అనంతం. సముద్రంవలె దాని తీరాలు కంటికి కనిపించవు. సముద్రం అడుగున నేల ఉంటుంది. కానీ, స్త్రీ హృదయం లోతుల్లో అదీ ఉండదు.

— విలిస్

"ఏమిటో ఆ తేడా?"

"మనికి హృదయం మాత్రమే ఉంటుంది. రసజ్ఞతకి హృదయంతో బాటు మేధస్సు కూడా ఉండాలి."

"మీరే గొప్పని చెప్పుకున్నారు, చూశారా?" నవ్వింది.

మనసులోని మాధుర్యమైన కోణాన్ని వ్యక్తీకరించి, చూపించే చొరవ స్త్రీకి ఎక్కువగా ఉంటుందేమో! లేకపోతే నన్ను అహంకారి క్రింద జమకట్టేసింది.

ఇంతలో ఇందాకటి సౌందర్యం ప్రవేశించింది. మెల్లిగా వచ్చి టేబిల్ మీద పౌడర్ టిన్ తీసుకుంది.

"మా చెల్లి" అంది కౌసల్య.

ఆ పరిచయానికి నా రెస్పాన్స్ అందుకోకుండానే చురుగ్గా వెళ్ళిపోయింది. ఇంత సౌందర్యానికి సంస్కారం లే దెందుకో?

"దీనికి పెళ్ళి చేసెయ్యాలనుకుంటున్నాను" అంది.

"మంచిదే ... కాని, మీరు ..."

"పెద్దదాన్ని నే నుండగా చిన్నదానికి పెళ్ళిచెయ్యడం కష్టం. చేసినా, మరి నాకు పెళ్ళి కాదనేగా మీ ఉద్దేశం."

"అది దురాచారమైనప్పటికీ మన సంఘంలో ఇంకా ఉంది."

"ఎదిరించలే మంటారా?"

"మీరు ఎదిరిస్తే మెచ్చుకొని అభినందించేవాణ్ణి నేనే. కాని, అదో సమస్య ఉన్నదని గుర్తించి దానికి పరిష్కారం వెతికే సిద్ధంగా ఉంచిన ట్లున్నారు."

"లేదు. కాని, నాలాగా దాని జీవితం కాకూడదు." ఆ మెరుస్తున్న కళ్ళలో ఒక మేఘం కదిలింది.

ఏదో అనాలి కనక— "మీ జీవితాని కేం?" అన్నాను.

విషాదంగా నవ్వింది. దుఃఖానికి మార్పేసే శక్తి ఉంటే ఆ నవ్వులోని విషాదానికి పచ్చని ప్రకృతి భగ్గున మండిపోయేది.

"రావ్‌గారూ! ఆడది ఒంటరిగా ... అందుకోసమూ డబ్బుకోసం సంఘంలో తిరిగితే ఎన్ని సమస్యలో? మీకు తెలుసు. నా జీవితానికి సెక్యూరిటీ లేదండి? ఈ నాడు నాలో కొంచెం ఆకర్షణ ఉంది. అది కొంత కాలంతో కరిగిపోతుంది. అప్పుడు నేనేం కావాలి? స్త్రీగా నాకు కొన్ని కోరికలూ, ఆశలూ ఉంటాయి గదా?" అచ్చంగా సినిమాల్లోనో, నవలల్లోనో పాత్ర మాట్లాడినట్లుంది. కాని, సినిమాల్లాగా, నవలలో లాగా జీవితముంటుందా?

కాని, నిజం చెప్పింది. సెక్యూరిటీ లేకనే నిరుద్యోగులూ, పెళ్ళికాని ఆడపిల్లలూ, మధ్య తరగతి ప్రజలూ బాధపడుతుంటారు. రేపేం జరుగుతుందో, రేపటికి ఏం చెయ్యాలో, ఆకలికీ ఆశలకీ ఓదార్పేమిటో నాకైతే తెలీదు. జీవితంలో అంతకన్న విషాదం లేదు.

"త్వరగా ఇల్లాలవండి" అన్నాను సన్నివేశాన్ని ఈజీ చెయ్యాలనే ఉద్దేశంతో.

"ఎవరికి?"

"ఏ పుణ్యాత్ముడికో?"

"అదంత తేలికా, రావుగారూ! నలుగురు మగాళ్ళతో కలిసి సంఘంలో తిరిగే నాలాంటి ఆడదాన్ని పెళ్ళిచేసుకోవడానికి ఏ పుణ్యాత్ముడూ ముందుకి రాలేదు. వచ్చినా, ఆ వివాహం సుఖాంతం కాలేదు." ఈ ఆలోచన కూడా ఒక పుస్తకం ప్రభావమే.

"అన్నీ మీరే చెపుతున్నారు. సూత్రం లేని శిక్షని సాధించడానికి ప్రయత్నం దేనికి?" అన్నాను.

"ఆశ!"

"వెతకండైతే" అన్నాను నవ్వుతూ.

నవ్వింది కౌసల్య. "ఎవరో ఒక మగవాడైతే చాలనుకుంటే నే నీపాటికి ఇల్లాలై వంట చేస్తూ, అంట్లు తోముతూ ఉండేదాన్ని. అలా కాదు. నా జీవితాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని క్షమించి చేరదీసే ఉన్నతమైన వ్యక్తి కావాలి." కౌసల్య మాటల్లో నిజాయితీకి ముగ్ధుణ్ణయ్యాను.

ఆమె మెచ్చుకున్న నా కథ గుర్తొచ్చింది. అందులోని పాత్ర కూడా ఇలాగే స్వేచ్ఛ కోరుకొంటుంది. అందుకేనా ఆ కథ కౌసల్య కంత నచ్చింది?

ఇంతకీ కౌసల్య నన్నెందుకు పిలిచినట్టు? శ్రీపతి చెప్పినట్టుగా కౌసల్య ప్రవర్తించడం లేదు. సౌమ్యంగా, స్నేహంతో, ఆత్మీయతతో మాట్లాడుతూంది. అందులో నటన గాని, వెకిలితనంగాని లేదు. ఆ సంస్కారం, ఆ మాట తీరు ఆమెలో ప్రత్యేకత.

"అలాంటి వ్యక్తి దొరకటం జరుగుతుందా?" అన్నాను. నే నీ ప్రశ్న వేస్తానని ఊహించినట్లు లేదు. చంద్రుడికి బదులు సూర్యుడే ఉదయిస్తే కలువల్లో కనిపించబోయే ఆశ్చర్యం ఆమెలో నేను గుర్తించాను.

నిరాడంబరమైన ఆ గదిలో నున్నగా, పొడవుగా, నీట్‌గా ఉన్న కౌసల్య తెల్లని కాగితం మీద వీనస్ పెన్సిల్ సూటిగా చెక్కి, తిన్నని ఓ గీత గీసినట్లుంది.

"దేశం గొడ్డుపోదు, రావ్‌గారూ?"

ఈ చర్చ నాకేమీ నచ్చలేదు. ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలూ, అభిరుచులూ చర్చించడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రమాదం ఉండచ్చు.

ఆ ప్రసంగం మార్చాలనే ఉద్దేశంతో— "మీ రీ మధ్య కొత్త నాటకంలో వేస్తున్నారా?" అన్నాను.

పిడుగుపడ్డట్టు చూసింది. "రావ్ గారూ! ప్లీజ్ ... నాటకాల గురించి మాట్లాడకండి. నా జీవితం లోపలా, వెలుపలా నాటకాలే అయిపోయాయి. నటనే అయిపోయింది. మీలాంటి వ్యక్తి నలుగుర్లా కాకుండా ప్రత్యేకంగా ప్రత్యేకమైన విషయాలు మాట్లాడితే బాగుంటుంది." అయితే, కౌసల్య నాకు ప్రత్యేకమైన స్థాన మిస్తుందా?

ఆమె గొంతులో ఆవేశం ఉంది. కళ్ళల్లో బాధ ఉంది. నటి కాబట్టి ఎక్కడ ఏ అక్షరం నొక్కి, తేలిక చేసి మాట్లాడితే ఎఫెక్టివ్‌గా ఉంటుందో బాగా అలవాటైనట్టుంది. నాటకాలంటే కౌసల్య కెందు కింత విముఖత? మరి మంచి నటి.

నిజమే. చక్కగా పాఠం చెప్పే మాస్టారు ఆ వృత్తికన్నా వ్యాపారం మంచిదంటాడు. బాగా రోగాలు నయం చెయ్యగల డాక్టరు అంతకంటే గుమాస్తా పని మేలంటాడు. యుక్తిగా వాదించి కేసు గెలిపించగల లాయరు రాజకీయాల్లోకి దిగిపోతాడు. ఈ రకమైన అసంతృప్తికి కారణా లేమిటి? ఏదైనా ఒక నేర్పు, అభిరుచి, తిండి పెట్టే వృత్తిగా మారితే మోనాటనీ పెరుగుతుందా?

నాటకాల గురించి మాట్లాడటం కౌసల్య కిష్టం లేదు. ఆమె వ్యక్తిగత విషయాలు మాట్లాడటం నా కిష్టం లేదు. మా ఇద్దరికీ రాజీ ఎక్కడుంది?

అనుకుంటుండగానే ఓ నలభై ఏళ్ళ స్త్రీ గదిలోకి ప్రవేశించింది.

నల్లగా లావెక్కిన శరీరం. చాలా పలచని తెల్లని చీర, గారెక్కిన పళ్ళు, ఎర్రగా ఉన్న కళ్ళతో అసహ్యంగా ఉంది.

"మా అమ్మ!" అని చెప్పింది కౌసల్య. ఎందుకో ఆవిణ్ణి చూస్తే నమస్కరించి, సభ్యత పాటించా లనిపించలేదు. [illegible] మనుష్యుల్ని తన చుట్టూ తిప్పుకో గలదు; దూరంగా తరిమెయ్యనూ గలదు.

ఈవిడకి కౌసల్యా, ఇందాకటి సౌందర్యా కూతుళ్ళంటే నమ్మశక్యం కాదు.

"ఏ ఊరు, నాయనా?" అనడిగింది, ఉపోద్ఘాతం లేకుండా ఉపన్యాసం లోకి దిగినట్టు. చెప్పాను.

ఊరుకులు పరుగులు

చిత్రం— కె. ఎస్. వరదాచార్యులు (గుంటూరు)



"ఏం చేస్తున్నావు?" చెప్పాను.

ఇలాగే ఆవిడ నన్ను నూతన మూల్యాంకనా పద్ధతిలో పరీక్ష చేసి నేనూ, నా వృత్తీ, నా కుటుంబమూ, నా ఆస్తీ, అప్పూ... అన్ని వివరాలూ తీసేసి వెళ్ళిపోయింది.

ఆవిడటు వెళ్ళాక—"మా అమ్మ మాటలు పట్టించుకోకండి" అంది.

కౌసల్యతో అర్థంలేని ఆడంబరం లేదు. ఏమాత్రం అసభ్యత లేదు. మరి ప్రకృతి చెప్పిందేమిటి?

బయటనుంచి కారు హారన్ వినబడింది.

"మీకు పిలుపొచ్చింది. ఆ హారన్ శ్రీపతిగారి కారుది!"

నేనూ లేచాను.

"ఉత్తరాలు రాస్తుండండి. లేకపోతే నేనే వచ్చేస్తాను సుమా!" అంది. నవ్వి, "తప్పకుండా రండి" అన్నాను.

"అలా అంటారు గాని, నా రాక మీ కిష్టముండదు. అన్నట్టు రేపుంటారా?"

"లేదు. కేరళ వెళ్ళాలి. రేపే బయలు దేరి పోతున్నాను" అన్నాను.

ఇవతలికి వచ్చేశాను.

అది శ్రీపతి కారే!

## 6

"ఏమంటుంది నీ కౌసల్య?"

"ఛ్ఛా, శ్రీపతీ! ఆమె నా కౌసల్య కాదు."

"ఏదో అన్నాన్లేవోయ్! వ్యాకరణం తప్పులు పట్టకు. పోనీ ఏం మాట్లాడిందో చెప్పు. ఎలా ప్రవర్తించిందో చెప్పు."

"చాలా సభ్యతగా ప్రవర్తించింది. ఏదో తన ఉద్దేశాలూ, అభిరుచులూ చెప్పింది. జీవితంపట్ల స్వంత నిర్ణయాలు కూడా చెప్పింది."

"ఏమిటి? నీకే?"

"అవును. నాకే! ఏం?"

"కౌసల్య సాధారణంగా మనసు విప్పి మాట్లాడదు."

"ఎందుకో నాతో మాట్లాడించనిపించింది."

"ఇంకా?"

"కౌసల్య జీవితం సినిమాలా ఉంటుందనుకుంటూంది."

"వాళ్ళమ్మ ఉందా?"

"ఉంది."

"ఇంటర్వ్యూ చేసిందా?"

"చేసింది."

"ఆ రాక్షసి కౌసల్యకి తల్లి కాదు. తల్లినని చెప్పుకుంటుంది. తనుకూడా ఆమె తన తల్లే అని ఒప్పుకుంటూంది. ఎందుకో తెలీదు. పోనీ ఆవిడ తల్లే అనుకుంటే ఏ తల్లీ కూతుర్ని తార్చదు."

"ఆకలి ఎంత పనైనా చేయిస్తుంది, శ్రీపతీ! ఆకలి తార్చిన వికృత రూపాలు ఈమధ్య ఏ పత్రిక తిరగేసినా కథలు కథలుగా, మన దేశం గురించి మనమే సిగ్గు పడేట్టుగా కనిపిస్తున్నాయి."

"ఏమైనా, కౌసల్య నీ పట్ల ఏదో శ్రద్ధ చూపిస్తూంది. అందుక్కారణం నువ్వు రచయిత కావడం."

"కాకపోవచ్చుకూడా!"

"వాళ్ళ చెల్లెల్ని చూశావా?"

"చూశాను."

"చాలా అందంగా ఉంటుంది కదూ!"

"అందం కాదు. సౌందర్యమును. ఆ పిల్లకి పెళ్ళి చేస్తానంటూంది కౌసల్య!"

"ఏం పెళ్ళి? సరైన రేటు వచ్చేదాకా అలాగే అంటారు."

"స్త్రీ గురించి అంత నీచంగా మాట్లాడతా వెందుకు, శ్రీపతీ?"

"నువ్వు ఊహాలో బతికితే, నేను నిజంగా జీవిస్తాను కనుక."

## 7

కొద్ది రోజుల్లో చాలా మార్పులు జరిగాయి.

మా ప్రాంతాని కెళ్ళి ఉద్యోగి ననిపించుకున్నాను.

ఓ సారి టైఫాయిడ్ పడి మృత్యువుతో పోట్లాడి తిరిగొచ్చాను.

ఒంటరిగా, జన్మస్థానానికి దూరంగా ఉండటం పెద్ద చిరాగ్గా ఉంది. పెళ్ళి చేసుకుంటే బాగుంటుందనే ఊహ మొదలవుతూంది.

---

**ప్రేమ తత్త్వం**

**శృంగారం మనిషిలో మానవత్వం సృష్టిస్తే, స్నేహం దాన్ని పదిలపరుస్తుంది. రెండూ ప్రేమ సూత్రమే. ప్రతిఫలం ఆశించని ప్రేమ స్వర్గాన్ని దగ్గర చేరుస్తుంది.**

—షేక్స్ప్

---

శ్రీపతి నుండి ఉత్తరం వచ్చింది. ఈ సారి కౌసల్య గురించి ప్రస్తావించాడు.

"నీ సన్మానం ఫోటోలు పత్రికల్లో చూసిందట. నువ్వు ఉత్తరాలు రాయడం లేదని ఫిర్యాదు చేస్తూంది. 'అసలు వాడు నీకు ఉత్తరా లెందుకు రాయాలి?' అనడిగాను. 'రచయితగా హృదయమున్న మనిషి కనుక' అంది. ఎడ్రసు కావాలంది. ఇవ్వనన్నాను. 'ఏ పత్రిక వాళ్ళకి రాసినా ఎడ్రసు దొరుకుతుంది. ఆ మర్యాద మీరే నిలబెట్టుకోండి' అంది. ఇచ్చాను. నువ్వంటే కౌసల్యకి స్వార్థమో, అభిమానమో, గౌరవమో ఏదో ఉంది. వ్యక్తిగతంగా కౌసల్య పైన నా అభిప్రాయం నీకు తెలుసు. ఇక నీ ఇష్టం.

—శ్రీపతి."

నిజమే. కౌసల్య నా పట్ల ఆసక్తి చూపిస్తూంది. కాని, ఆమె ప్రయత్నిస్తే నా కన్నా గొప్పవాళ్ళ స్నేహాన్ని పొందగలదు.

ధనధాన్యాలుగానీ, హోదా గానీ నా దగ్గరేమీ లేదు, ఒక్క కలం తప్ప. అదే కారణమైతే, ఆ కథ కౌసల్యని చాలా ప్రభావితం చేసి ఉండాలి. ఏమో?

## 8

ఆ రోజు ఆదివారం.

ఊరంతా సర్వే చేసి నా గదికి చేరుకున్నాను. దూరం నుండే ఇంటి ముందర ఓ స్త్రీ మూర్తి కనిపించింది. పోల్చేశాను.

కౌసల్య!

రిక్షావాడితో ఘర్షణ పడుతూంది. రూపాయి కోసం పది రూపాయల నోటు ఇస్తూంది. చిల్లర లేదంటాడు వాడు.

నన్ను చూసి మనిషంతా చలించింది.

"నమస్తే! మీ దర్శనానికే" అంది.

"నమస్తే" అన్నాను.

"నా డబ్బు నా కిచ్చెయ్యండమ్మా! నాను పోవాల" అంటున్నాడు రిక్షావాడు.

"నువ్వు చిల్లరివ్వు. నా దగ్గర చిల్లర్లేదు. ఏం చెయ్యను?"

"నే నిస్తాను. . . ఫరవాలేదు" అంటూ డబ్బు తీసి రిక్షావాడి కిచ్చాను. వాడు వెళ్ళాడు.

గది తాళం తీసి, "పదండి" అన్నాను.

నా వెనకే వచ్చింది.

"క్షమించండి. బాగా అలిసిపోయాను. నిలుచోలేను. కూర్చోనూ లేను" అంటూ ఆ గదిలో నా పెర్మనెంటు మంచంపై వాలిపోయింది. "అయినా, ఇదేం ఉద్యోగమండీ దేశం చివరి కొచ్చేశారు మరెక్కడా బతుకుతెరువు లేనట్టు? అబ్బబ్బ. . . కొండలు . . . ఒళ్ళు పిప్పయిపోయింది" అంటూంది.

కుర్చీ దగ్గరగా తీసుకుని కూర్చుంటూ, "ఎక్కడినుంచీ అకాలవర్షం, కౌసల్యా?" అన్నాను.

"ఇంటినుండే...మీ దగ్గరకే. దారి తప్పలేదు. రావాలనే వచ్చాను. సరేనా? మీరు ఉత్తరాలు వ్రాయకపోతే వస్తానని మాటిచ్చానుగా మరి?" అంది నవ్వుతూ. ఎండ వేడిమీ, ప్రయాణపు బడలికా ఆ చిరునవ్వుని పెదాలకి అతక నివ్వలేదు.

"నిజంగా?"

"అహాఁ. . . ఖచ్చితంగా. . . అబ్బ, తలనొప్పిగా ఉంది, బాబూ!"

"నేను కనిపించినప్పుడల్లా అలాంటి దేదో ఉండాలిగా మరి" అంటూ నవ్వుతూ లేచి, పనిపిల్లని పిలిచి ఆస్ప్రో మాత్రలు తెమ్మన్నాను.

కౌసల్య తలగడ మీద మోచేతిని ఆన్చి సగం లేస్తూ నా వైపు పరిశీలిస్తూంది. "మీరు చిక్కిపోయారు. . . చింతా?" అంటూంది.

"నా కేం చింత?"

"పెళ్ళాం కావాలని!"

ఎక్కడిదీ చనువు?

చెదిరిన ముంగురులతో, అలసట పెళ్ళ చలితమైన కళ్ళతో అప్పుడామె అరణ్యానికి నిప్పంటుకుంటే భయంతో వచ్చి చేరిన వనకిన్నెరలా కనిపించింది.

పనిపిల్ల ఆస్ప్రోమాత్రలు తెచ్చింది. గదిలో నీళ్ళు లేవు. ఇంటి యజమానింటికి పంపించాను నీళ్ళు తెమ్మని.

పనిపిల్ల నీళ్ళు తెచ్చింది.

ఆ వెనకే మా ఇల్లుగలావిడకూడా వచ్చింది, "ఎవ ర్నాయనా! నీ ఇంటికి ఆడపిల్లొచ్చిందట" అంటూ. నాకు మతి పోయింది. ఏం చెప్పను? ఎవరని చెప్పను?

"నమస్కారం, బామ్మగారూ! ఈయన మా బావగారు. నన్ను పెళ్ళి చేసుకోకుండా తప్పించుకు తిరుగుతుంటే నేనే వచ్చేశాను" అంది కౌసల్య, జంకు లేకుండా.

"ఆహాఁ. . . ఏం విషయం? ఏం సరదా? ఎంత మంచి పిల్లవమ్మా! బావంటే ఎంత అభిమానం? ఎంత ఇది! బాబయ్యా! ఇంతచక్కటి మరదలుండగా చెప్పవేం? శుభస్య శీఘ్రం. త్వరగా పెళ్ళి చేసుకోండి. ఎన్నాళ్ళీ హోటల్ భోజనం, మఠం నిద్రా? మీ పెళ్ళికి నాకు చెప్పాలి సుమా"

"బావ చెప్పకపోయినా, నేను చెబుతానండీ, బామ్మగారూ! మీరు రావాలి."

"ఎందుకు రాను! తప్పకుండా వస్తాను" అంటూ తుఫానులా వెళ్ళిపోయింది ముసలావిడ. సమస్యకి పరిష్కారం ఆలోచించే వైనాన్ని బట్టి ఉంటుంది.

ఈ సన్నివేశం సినిమాల్ని, నవలల్ని గుర్తు చేస్తూంది. అంటే కౌసల్య ఆ విధంగా ఆలోచించి జీవిస్తూందన్న మాట.

కౌసల్య నవ్వు.

విచిత్రమైంది స్త్రీ.

కాస్సేపయ్యాక—"తలనొప్పి తగ్గిందా, కౌసల్యా?" అన్నాను.

"మీ లాగ శ్రద్ధ తీసుకునే వాళ్ళుంటే తలనొప్పి తగ్గకపోతేనేం?"

నా మెదడులో ఏదో సరానికి తట్టినట్టయింది.

నే నింకా తేరుకోక ముందే మాట మార్చేసి మరిపించేసింది.

ఇక తపస్సు చేసినా కౌసల్యని అర్థం చేసుకోలేను.

ఎందుకో నా డాక్టరు మిత్రుడు గుర్తొచ్చాడు.

ఎంత వయసొచ్చినా పెళ్ళి చేసుకోడు. అతడు కోరుకున్న లక్షణం గల స్త్రీ ప్రత్యేకంగా సృష్టించబడాలి. అంతే! పుస్తకాల్లో పువ్వులతోటల్లో ఆటల్లో సంగీతంలో తల దాచుకుంటాడు. స్త్రీ శరీరంలో ప్రతి భాగాన్ని చదివిన అతడికి సౌందర్య దృష్టి లేదా? అనడానికి వీల్లేదు. 'ఆమె నగ్న శ్వేత చరణాల కింద భూహృదయం ఉప్పొంగుతూంది' అని టాగూరు అంటే, 'ఆచరణాల మీద వెంట్రుక లుండవచ్చు' అంటా డతను. అంటే భరించలేని సౌందర్యానికి వికృత రూపాన్నాపాదించి ఊరడించుకుంటాడు.

ఆ మిత్రుడొకడు నా కర్థం కాడు.

ఈ కౌసల్యకూడా అర్థం కాదు.

ఇలాంటి స్త్రీ నా డాక్టరు మిత్రుడికి తారసపడితే ఎలా ఉంటుందో?

ఆ రోజు కౌసల్య చేతి భోజనం.

"పరాయి స్త్రీ చేతి భోజనం నల్ల ఇంత ఆనందంగా ఉంటుందని నాకు తెలీదు, కౌసల్యా?"

"ఆ ఆనందంశాశ్వతంచేసుకోవచ్చు."

కౌసల్య ఏ వ్యాటు మళ్ళిస్తుందో లీలగా తెలుస్తూంది. అందుకే ఇంత దూరం వచ్చిందా? అయితే, నే నేం చెప్పను?

సాయంత్రం బీచికి షికారు వెళ్ళాం.

ఒడ్డునే కూర్చుంటే తగిలే నీటి కెరటాలు జలకన్యలు మోకరిల్లి నమస్కరించి నట్టున్నాయి. వాతావరణంలో చల్లదనం రక్తంలో జీర్ణమవుతూంది. ఆహ్లాదకరమైన ఆలోచనలు అలుముకుంటున్నాయి. ఒక సమగ్రమైన ప్రకృతి సౌందర్యం సర్వేంద్రియాల్ని తన వైపు ఆకర్షించుకుంటూంది. ఎవరమూ ఏమీ మాట్లాడలేదు.

నింగి నేలా ఏకమై ప్రకృతి పరవళ్ళు తొక్కే చోట మనిషికి మౌనమే ఆనందం.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ, "మీ సలహా కావాలి, రావుగారూ?"

"దేనికి?"

"కావాలి. చెపుతారా?"

"చూడండి, కౌసల్యా! ఒక పులి ఎదురైతే తనేం చేస్తాడో ఆలోచించడం మరిచిపోయి. ఇతర్లకి మాత్రం చెట్టెక్కి పొండి అని చెప్పడమే సలహా! నిజంగా నాకు సలహాలంటే కిట్టదు. పోనీ చెప్పండి మీ కేం కావాలో?"

"నేనే ముందు ఒక దారి చూసుకొని, తరవాత చెల్లికి దారి చూపించాలనుకుంటున్నాను" అంది.

"కారణం?"

"మీ రన్నదే. మా చెల్లి భవిష్యత్తుకి నేను అడ్డు గోడని కాకుండా. . . ఉండా అని."

"ఇందులో నా సలహా ఏమిటి?"

దానికి సమాధానం చెప్పలేదు కౌసల్య.

ఏమైనా, మా ఇద్దరి మధ్యా వాతావరణం తిమ్మిరెక్కినట్టుగా ఉంది.

మళ్ళీ మా సంభాషణ పెడదారి పట్టింది.

"అప్పటి మీ కథలో రచయిత పాత్రని చాలా ఉన్నతం చేశారు. గొప్ప వ్యక్తిత్వం. గొప్ప మనస్సు. అతనిలా అందరూ ఉంటే దేశం నందనవనమౌతుంది" అంది. ఎవర్ని ఉద్దేశించి నట్టు?

"అవుతుంది నిజమే ... కాని, అలా ఉండాలిగా."

"ఉండాలంటే చాలదు. ఎవరో కంకణం కట్టుకొని రంగంలోకి దూకాలిగా! గాంధీజీ తన ఆశ్రమంలో హరిజనులకి చోటిచ్చిన తరవాతనే ఇతర్లకి బోధించాడు."

"వీరేశలింగంగారు కానీ, గురజాడ వారుకానీ విధవని పెళ్ళి చేసుకున్నట్టు నిదర్శనా లేవు" అన్నాను.

"చేతకీ, రాతకీ సంబంధం లేకపోతే ఎలా?"

ఈ విధంగా కౌసల్య వాదించింది.

నే నేదో సర్ది చెప్పాను.

అప్పుడుకూడా ఇద్దరమూ సూటిగా మాట్లాడుకోలేదు. ఏదైనా అనె పెదాలు దాటితేనే మంచిదని నేనూ, బహుశా నా కర్థం కాకపోతుందా అని ఆమే. . . సందేహం లేదు— ఆ కథ కౌసల్య మీద ముద్ర వేసింది. దీని పరిణామం ఇంకా ఎలా ఉంటుందో తెలీదు.

బీచ్‌నుండి తిరిగి వచ్చేశాము.

రాత్రి నిద్ర పోయేముందు. . .

"కౌసల్యా! మీ రిలా ఒంటరిగా రాకుండా ఉండాలిసింది. యౌవనం శరీరం లోని వివేకాన్ని పోగొడుతుంది. . ." అన్నాను కొంచెం బాధగా.

"మీరు సాదా మనిషి, కారనే నమ్ముతున్నాను. . ." అంది.

అంతే. . . నిద్ర పోయాను.

అర్ధరాత్రి మెలకువలో కౌసల్య నవ్వుని నిట్టూర్పు వినిపించక పోలేదు. కాని, ఏమీ అనునయించ లేకపోయాను.

ఉదయాన్నే ఆమె బయలుదేరి పోయింది. గట్టిగానే వీడ్కోలు చెప్పాను.

వచ్చినప్పటి ఉత్సాహం ఆమెలో లేకపోయింది.

దీనికి బాధ్యు లెవరు?

9

మా బంధువర్గంలోనే నాకు నచ్చిన అమ్మాయితో పెళ్ళి నిర్ణయమై పోయింది. ముహూర్తంకూడా నిశ్చయమైంది.

అప్పటికే నా స్వస్థలానికి దూరంగా బదిలీ చేయించుకున్నాను.

ఈ మధ్య నా నవలొకటి సీరియల్‌గా పడుతూంది.

దేశం నలుమూలలనుండి అభిమానులు ఉత్తరాలు రాస్తున్నారు.

కౌసల్య నుండి మాత్రం ఏ ఉత్తరమూ రాలేదు.

కౌసల్య నాలో చాలా భాగం ఆక్రమించుకుంది. అది ప్రేమ కాదు. కామం కాదు. జాలి, సానుభూతి కాదు. . . కళ వల్ల కానేకాదు. ఇంకేదో?

వివాహానికి రమ్మని శ్రీపతికీ, కౌసల్యకీ కూడా ఆహ్వానాలు పంపాను.

10

పెళ్ళి నాలుగు రోజులుందనగా శ్రీపతి నుండి ఉత్తరం వచ్చింది. పెళ్ళికి ఒక రోజు ముందుగా వస్తానన్నాడు. చివర్లో కౌసల్య ప్రస్తావనకూడా ఉంది.

"కౌసల్య కనిపించి నీ ఆహ్వానం అందిందని చెప్పింది. పెళ్ళికి రావట్లేన్నాను. రాన్లేండి అంది. కాని, మనిషి చాలా బాధ పడ్డట్టుంది. బాగా చిక్కిపోయింది. నిజంగా కౌసల్య నిన్ను ప్రేమించింది. నా కిప్పుడు నమ్మకం కలిగింది. కాని? నీ చేతి కిమ్మని ఏదో పాకెట్ ఇచ్చింది. ఒకప్పుడైతే విసిరేద్దును గాని, ఇప్పుడు ఆమె మీద ఏర్పడ్డ ఆదరంతో నాతో తీసుకొస్తాను. . . వేచి ఉండు.

—శ్రీపతి."

అనుకున్నట్టుగానే పెళ్ళి రేపనగా ఆ రోజు వచ్చాడు శ్రీపతి. వాడితో ఆసక్తి కలిగించింది కౌసల్య పంపిన పాకెట్.

విప్పాను.

"రావ్‌గారూ!

మీలో రచయితని ఆరాధించాను. ఆ ఆరాధన శాశ్వతం చేసుకోవాలనికూడా ప్రయత్నించాను. మీ కథలో రచయిత పాత్రలా ప్రవర్తిస్తా రనుకున్నాను. నా అంచనా తప్పయింది. కాని, ఆరాధన మాత్రం మిగిలిపోయింది.


దీనితో ఒక తాళికూడా పంపిస్తున్నాను. అది నేనే మీ చేత నా కంఠంలో కట్టించుకోవాలని దాచాను. ఆ అదృష్టం మరొకరు తీసుకున్నారు. నాకీ ప్రపంచం మీద విసుగెత్తింది.

ఈ ఉత్తరం మీకు చేరేసరికి నేను మాత్రం ప్రశాంతతని అన్వేషిస్తూ ఏ సుదూర తీరాలకో పోతున్నాను.

—కౌసల్య."

ఈ తాళి, ఈ [illegible] ముగింపుకూడా ఆ కథలాగే చేసింది కౌసల్య.

రచయితగా నే నేం చేశాను? *



యుద్ధానికి నాంది

చిత్రం—ఎస్. మురళీధరరావు ( ఏలూరు )